క్లుప్తంగా

చదువుకు ఆర్థిక సాయం



నూకాలమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వేమగిరి రామదాసుపేటకు చెందిన కర్రి నూకాలమ్మకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆర్థిక సాయం అందించారు. నూకాలమ్మ భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. వారిని చదివించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ పిల్లల చదువు నిమిత్తం నూకాలమ్మకు ఆర్థిక సాయం అందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడు, మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు కళ్యాణ్ నగర్ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దేవరకొండ మాణిక్యాన్ని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధితులకు జక్కంపూడి రాజశ్రీ పరామర్శ



రాజమహేంద్రవరంలో బాధితుడిని పరామర్శిస్తున్న జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: వివిధ ప్రమాదాలు, అనారోగ్య ఇబ్బందులతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని వివిధ హాస్పటళ్లల్లో చికిత్స పొందుతున్న వారిని, ఇంటి వద్ద వైద్యం చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోరుకొండ మండం బుచ్చెంపేట గ్రామానికి చెందిన గంగాధర్ మోటార్ సైకిల్‌తో డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బొల్లినేని హాస్పటల్లో చికిత్స పొందుతున్న అతడిని రాజశ్రీ పరామర్శించారు. గుమ్ములూరుకు చెందిన చిన్న వెంకన్న ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరం ప్రైవేటు హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. కణుపూరు గ్రామానికి చెందిన శ్రీరామచంద్రమూర్తి గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో ఉన్నారు. వారిద్దరి ఆరోగ్య పరిస్థితిని రాజశ్రీ తెలుసుకున్నారు.

ఎస్‌బీఐ సేవలపై ప్రజలకు అవగాహన

మధురపూడి: భారతీయ స్టేట్ బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గ్రామాల్లో కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు కోరుకొండ బ్రాంచి మేనేజర్ బాబూరామ్ భరత్ తెలిపారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవపురం, దోసకాయలపల్లి, దేవీపట్నం మండలం ఇందుకూరుపేటల్లో శుక్రవారం కళాజాతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భరత్ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సురక్ష పేరిట జనరల్ ఇన్సూరెన్స్, వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం, కోళ్లఫారాల ఏర్పాటుకు, గేదెల పెంపకానికి రుణాలందిస్తున్నట్టు తెలిపారు. అలాగే వినియోగదారులు సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూనో యాప్ వినియోగం, మార్కెటింగ్ స్కీములను వివరిస్తూ రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాబృందం ప్రదర్శనలు చేసింది.

452 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని రాపాకలో సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, డాక్టర్ ఏసురాణి, స్పెషలిస్టులు డాక్టర్ జీఆర్ చైతన్య, డాక్టర్ స్వాగత్ 452 మందికి వైద్య సేవలు అందించారు. పది మందికి ఈసీజీ, 316 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అందరికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. రోగులకు అవసరమైన మందులను సర్పంచ్ గన్నిన బ్రహ్మాజీ, ఎంపీటీసీ సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఆటల్లో అదరహో..

- పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న వైనం

ప్రకాశం నగర్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడమే కాకుండా జాతీయ పోటీలకు ఎంపికవుతున్నారు. ఇటీవల చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టీలో జరిగిన సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థులు ఎంఎల్ శ్రీనివాస్, కె.సతీష్, ఈ.మణికంఠ ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్‌లో గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన తీగిరెడ్డి శ్రీ ప్రభాత్‌సాయి జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 14 వరకూ కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో అండర్ 19 యూత్ బాయ్స్ టీం కెప్టెన్‌గా వ్యవహరించాడు. వ్యక్తిగత విభాగంలో కూడా పాల్గొని సత్తా చాటాడు. ఇదే అకాడమీకి చెందిన జి.సిరిపావని 85వ అంతర్రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ – 17 బాలికల విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ తరఫున ప్రాతినిథ్యం వహించింది. 2023లో రాష్ట్రంలోని వివిధ నగరాల్లో జరిగిన నాలుగు ర్యాంకింగ్ టోర్నమెంట్లలో విజయం సాధించడమే కాక, గత అక్టోబర్‌లో అనంతపురంలో జరిగిన ఏపీ స్టేట్ చాంపియన్ షిప్‌లో అండర్ – 17 బాలికల విభాగంలో విజయం సాధించి స్టేట్ చాంపియన్ షిప్‌గా నిలిచింది.



కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన అక్షిత, సింధును అభినందిస్తున్న ప్రముఖులు

కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గంగవరపు అక్షిత రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో అండర్ – 19 విభాగంలో బంగారు పతకం సాధించగా, కూడిపూడి సింధు వెండి పతకం సాధించారు. విజేతలకు జోన్ – 2 ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఐ.శారద, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నరసింహం అభినందనలు తెలిపి, ఘనంగా సత్కరించారు.

క్రీడాభ్యున్నతికి పెద్ద పీట

ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేయడంతో పాటు క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషిపై పలువురు క్రీడా విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఇటీవల స్కూల్ గేమ్స్ నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆడుదాం ఆంధ్ర పేరుతో మరో క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేయడంతో పాటు వారికి కావాల్సిన అల్పాహారం, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తోంది.

> **ఉద్యోగావకాశాలు**
> చదువులతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థులకు మంచి ఉద్యోగం సంపాదించే అవకాశం ఉంటుంది. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శరీరం దృఢంగా మారుతుంది. గతంతో పోల్చితే ప్రసుతం క్రీడలపై యువతకు ఆసక్తి పెరిగింది.
> – వైవీ ప్రసాద్, పీడీ



వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ తదితరులు

వంగడాలు, రైతుల హక్కులపై వర్క్‌షాప్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మొక్కల పరిరక్షణ, రైతుల హక్కుల అథారిటీ (పీపీవీఎఫ్ఆర్ఏ) ద్వారా అందుతున్న హక్కులను రైతులందరూ వినియోగించుకోవాలని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సెమినార్ హాల్లో శుక్రవారం రైతు వంగడాల మరియు హక్కుల పరిరక్షణ అనే అంశంపై ఆయన అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ జన్యు శాస్త్రం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ జె.సురేష్ మాట్లాడుతూ పీపీవీఎఫ్ఆర్ఏ ఆవిష్కరణ పాత్ర, రైతుల హక్కులు, రిజిస్ట్రేషన్ పద్ధతులు, హక్కుల ప్రచారం, ఆర్థిక ప్రయోజనాలు, రైతులకు భరోసా అనే అంశాలపై వివరించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.రవిశంకర్ సీటీఆర్ఐ – ఐటీఎంయూ ముఖ్యఉద్దేశాన్ని వివరించారు.

వంగడాల ప్రాముఖ్యతపై అవగాహన

మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ భారతీలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధికి మూలకారణమైన వంగడాల ప్రాముఖ్యతను వివరించారు. సీటీఆర్ఐ పంటల అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ కె.సరళ మాట్లాడుతూ పీపీవీఎఫ్ఆర్ఏ రైతు వంగడాల, హక్కుల ప్రాముఖ్యతను తెలిపారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.శ్యాంరాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు మాట్లాడుతూ నూతన వంగడాలు, అవగాహన సదస్సులు, ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు రైతులు చాలా ఉపయోగకరమని పేర్కొన్నారు. పెద్దాపురం ఐఐఎంఆర్ రీసెర్చ్ స్టేషన్ హెడ్ డాక్టర్ మునిరత్నం, సీనియర్ శాస్త్రవేత్తలు జి.రామానందం, కె.రవీంద్రకుమార్, పి.లలితా కామేశ్వరి పాల్గొన్నారు.

పౌర జీవనానికి రాజ్యాంగమే ప్రామాణికం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బయలుదేరిన మంత్రి వేణు

- అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్/కడియం: దేశంలో పౌర జీవనానికి ప్రామాణికం రాజ్యాంగమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. విజయవాడలో శుక్రవారం జరిగే సామాజిక న్యాయశిల్పం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు రూరల్ నియోజకవర్గం నుంచి నాయకులు, ప్రజలతో కలిసి ఆయన పయనమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యానికి ముందు 1931లో కులగణన జరిగిందని, అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ రోజున మళ్లీ కులగణన ప్రారంభించడం ఆయనకు ఇస్తున్న ఘనమైన నివాళి అన్నారు. స్వాతంత్ర్య అనంతరం కులగణన జరగని కారణంగా అనేక మందిలో అపోహలు ఉన్నాయన్నారు. వాటన్నింటినీ పటాపంచలు చేసి, పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన ప్రక్రియను ప్రారంభించారన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రూరల్ నియోజకవర్గం నుంచి నాయకులతో కలిసి 15 బస్సుల్లో వెళుతున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలమంది మంది తండోప తండాలుగా తరలివస్తున్నట్లు తెలిపారు. దేశ సంపద సంపన్నులకే కాదు సామాన్యులకూ అందించాలనే ఆకాంక్షతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు.

సమసమాజ స్థాపనే లక్ష్యంగా జగన్ పాలన

- అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి
- ఎంపీ భరత్‌రామ్



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: సమసమాజ స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. విజయవాడలో శుక్రవారం జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణకు నగరం నుంచి బయలుదేరే బస్సులను రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. జగనన్న ప్రభుత్వంలో సామాజిక సాధికారత ఒక నినాదం కాదని, అది రాష్ట్ర ప్రభుత్వ విధానం అన్నారు. విద్య అనే పదునైన ఆయుధంతో సాంఘిక అసమానతలను తొలగించేందుకు జగనన్న విద్యారంగానికి అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. బడుగు బలహీన వర్గాలు అగ్రవర్ణాలతో సమానంగా జీవించాలన్నదే డాక్టర్ అంబేడ్కర్ ఆలోచనా విధానమని, దానికి సీఎం జగన్ ఆచరణలో తీసుకొస్తున్నారన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహ స్ఫూర్తితో క్వారీ సెంటర్‌లో పార్లమెంట్ భవన నమూనాతో అద్భుతమైన కట్టడాన్ని, ఆ భవనంపై అంబేడ్కర్ విగ్రహాన్ని ఫిబ్రవరి మొదటి వారంలో ఆవిష్కృతం చేయనున్నట్లు తెలిపారు. జర్నలిజానికి తలవంపులు తెచ్చేలా ఇష్టం వచ్చినట్లు వార్తలు రాస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం ఈనాడు రామోజీరావుకు అలవాటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడిగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబు కుల వివక్షను ప్రేరేపించేలా వ్యాఖ్యానించినప్పుడు ఈనాడులో రామోజీరావు రాయలేకపోయారన్నారు.

సీఎం జగన్ పాలనకు అందరి మద్దతు



శాటిలైట్ సిటీ సచివాలయం-2లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి, పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో జరుగుతున్న సీఎం జగన్ పాలనకు అన్ని వర్గాల ప్రజలూ మద్దతు తెలుపుతున్నారని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం -2లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్ల కాలంలో గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన లబ్ధితో కూడిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం ఏబ్లాకు కూడలిలో నాయకులతో కలిసి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. తాటికొండ విష్ణుమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలను సీఎం జగన్ తీసుకువచ్చి గడప వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి మేలు జరుగుతోందన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ, సచివాలయ కన్వీనర్లు సఫారి నాయుడు, కుడిపూడి సత్యనారాయణ, గాదె అనురాధ, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, పార్టీ నాయకులు దొమ్మేటి అర్జునరావు, కుడిపూడి పద్మ, బత్తిన అప్పారావు, పగడం లక్ష్మణరావు, చెరుకూరి మనోహర్, మీగడ గంగాధర్, పుచ్చా గోవిందరెడ్డి, ఎంపీవీ సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, రుంకాని రవికుమార్, పుచ్చా ప్రసన్నకుమార్‌రెడ్డి, గొర్లె రమణ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరాలు



మురమండలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



కాతేరులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో దశలో భాగంగా శుక్రవారం మురమండలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 430 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని కల్యాణ మంటపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 54 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, ముగ్గురిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. శిబిరం ఇన్‌చార్జిగా జి.స్వరూప వ్యవహరించగా, గైనకాలజిస్టు ఎల్.మోహన్‌వంశీ, జనరల్ మెడిసిన్ జి.రత్నమాధురి, ఆప్తమాలజిస్ట్ వి.గౌతమ్ వైద్యసేవలు అందించారు. గ్రామ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి బి.సరోజారాణి పాల్గొన్నారు.

407 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామ సచివాలయం-3 పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 407 మందికి వైద్యసేవలు నిర్వహించి నలుగురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, కాతేరు పీహెచ్‌సీ వైద్యులు నాగదేవి, జగదీష్ కృష్ణ, జనరల్ సర్జన్ వర్ష, ఆర్థోపెడీషియన్ కె.వరప్రసాద్, కంటి పరీక్షల ఆప్తాల్మిజిస్టులు వైద్యసేవలు అందించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, సచివాలయ కన్వీనర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ నెలాఖరులోగా ఇళ్ల స్థలాలు



వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ నెలాఖరులోగా ఇళ్ల స్థలాల పట్టాలను అందిస్తామని, ఈ విషయంపై ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో మండలంలోని కొండగుంటూరు, జి.యర్రంపాలెం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాలకు సంబంధించిన వివిధ విషయాలు, రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్గ, వైషమ్యాలను పక్కన పెట్టి, సమష్టిగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడచిన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ కలుసుకుని వివరించాలన్నారు. అదే సమయంలో గత చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పింఛన్ల కోసం ప్రజలు పడిన పాట్లను, ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా గుర్తు చేయాలన్నారు. పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే, వాటిని సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ విజయ యాత్ర



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



ఆకట్టుకున్న వేంకటేశ్వరస్వామి వేషధారణ

సీటీఆర్ఐ: అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో శ్రీరామ విజయ యాత్ర నిర్వహించారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి దానవాయిపేట, జాంపేట, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా ఆల్కాట్ గార్డెన్స్ గేదెల నూకరాజు కల్యాణ మంటపం వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపీనాథ్‌దాస్ ప్రభూజీ సారథ్యంలో కోలాహలంగా సాగిన ఈ యాత్రలో రామ నామ సంకీర్తనలు మార్మోగాయి. గరగలు, డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాట బృందాల భజనలు, కేరళ చెండై వాయిద్యాలు, పొడుగు మనుషులు, పౌరాణిక వేషధారణలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. సత్యగోపీనాథ్ ట్రస్ట్ పక్షాన శ్రీరామ లీలలను వివరిస్తూ ఫ్లెక్సీలతో ఏర్పాటు చేసిన వాహనాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. తొలుత రామాలయం సెంటర్ సభలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం కోసం 500 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు సాగాయన్నారు. ఆ రామాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 22న ప్రాణప్రతిష్ఠ చేయబోతున్న సందర్భం కోసం దేశమే కాకుండా ప్రపంచమంతా ఎదురుచూస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్య రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అన్నిచోట్లా రామనామ సంకీర్తనలు, భజనలు చేయాలన్నారు. శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం చైర్ పర్సన్ జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ అయోధ్యలో రామయ్య కొలువుదీరుతున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని, రామభక్తి చాటుకోవాలని కోరారు. సత్యగోపీనాథ్‌దాస్ మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా శ్రీరామ విజయ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, యాత్ర కన్వీనర్ తోట సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పాల్గొన్నారు.



రథంలో సీతారాముల విగ్రహాలు

సినిమాలు

శ్యామల	: సైంధవ్
సూర్యమినీ	: సైంధవ్, నా సామిరంగ
సూర్యప్యాలెస్	: గుంటూరుకారం
స్వామి	: గుంటూరుకారం
శివజ్యోతి	: నా సామిరంగ
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామిరంగ
రంభ	: నా సామిరంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: గుంటూరుకారం
నామవరం	
వీఎస్ మహల్	: హనుమాన్, నా సామిరంగ, సైంధవ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: నా సామిరంగ, గుంటూరుకారం
కడియం	
వెంకటసూర్య	: హనుమాన్, నా సామిరంగ